# స్వైర మేళా

సీరియల్ లైట్లు వెలిగి పోతున్నై.
గేటు నిండా అవే – రకరకాలు !

"వెల్‌కమ్" బోర్డు ; రామరావణ యుద్ధం ; మార్కండేయుడు - శివలింగం - యముడు; నక్షత్రం - స్వస్తిక్ – సర్కిల్ – ఒకేసారి అన్నీ వింత వింత ఆకృతుల్ని వెదజల్లుతున్నై.

గేటుకి అటూ ఇటూ రెండు వరుసల్లో నాలుగు గజాలకొక ట్యూబ్‌లైట్ చొప్పున 24 ట్యూబ్‌లైట్లు – వసారాదాకా - బారులు తీరిన ప్రశ్నార్థకాల్లా నిలబడి వున్నై. వాటిని ఒకదానితో ఒకటి కలుపుతూ చిన్నలైట్ల తోరణాలు. వీటన్నిటి నడుమా రంగు కాగితాల తోరణాలూ, కాగితపు బుట్టలూ, మామిడి మండలూ, బెలూన్ల గుత్తులూ !

టౌనుహాలు - కలవారి మిడిసిపాటుని ప్రదర్శిస్తోంది.

ఒక సాహిత్య సంస్థ తన పుట్టినరోజుని జరుపుకుంటోంది!

నలుగురు తారలూ, ఒక వి. ఐ. పీ. మరో నలుగురు హోదా గల కవులూ వస్తున్నారు.

జనం హడావిడీ, జనాన్ని అదుపుచేసే జనం హడావిడీ, ఏ పనీ లేని జనం బరాబరీ — అన్నీ అవక్ర పరాక్రమంతో సాగిపోతున్నై. కార్లూ, జీపులూ తమ రొద తాము చేసి పోతున్నై.

"సాహిత్య సమావేశాలలో తొంభై శాతం ప్రేక్షకులూ, పదిశాతం శ్రోతలు." ఎవరో చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

టౌన్‌హాల్‌కు ఎదురుగా రోడ్డుకు ఆవలి వైపు ఓ డాబా వుంది. దానిముందు ఓ షామియానా వెలిసింది. దాని క్రింద ఓ పాతిక ముప్పై కుర్చీలూ వున్నై.

డాబా యింట్లో దీపాల కాంతిలో పండగ పరిమళాలు పరుచుకుని వున్నై. పట్టుచీరల రెపరెపలూ, పడుచుపిల్లల కిలకిలలూ, పసివాళ్ళ పరుగులూ — సంబరం మంచి పసందుగా కనిపిస్తోంది.

డాబా యిల్లు — మ ధ్య త ర గ తి మిద్యా గౌరవాన్ని కాపాడుతోంది.

ఆ యింటి వారమ్మాయి పెద్దమనిషి అయిందట. ఇవాళ 'ఫంక్షన్' ఏర్పాటు చేసుకున్నారు !

ఇక్కడ మైక్‌సెట్ తన పనికి ఉపక్రమించింది. మొట్ట మొదటి పాట — "దూర దేశ మేగెదవో పెండ్లికూతురా !" ఘంటసాల పాడుతున్నాడు.

టౌన్‌హాలులో మైక్‌సెట్ తన ఆ ధి క్య త ని నిలుపుకోవాలని గొంతు సవరించుకుంది.

డాబా యింట్లో రెండోపాట — 'కీచు కీచు ...' కీచు కీచు' "కీచు కీచు ..." ౙ్ర్ ... ౙ్ర్ ... చ్ ... చ్ ...చ ... చు ... చ్చు ... ౙ్ర్ ... చ్చ్ ... చ్చ్ ... చ్చు ... ౙ్ర్ ..." లో పడింద. మరుక్షణంలో సర్దుకుని 'పిట్ట ...' అంది. అంతలో రికార్డుకి మళ్ళీ నొప్పులు బయల్దేరినై. "ట్ట ... ట్ట్ ... ట్ట్ ... ట్ట ... ౙ్ర్ ... ౙ్ర్ ... ర్" "పిట్ట ... పిట్ట ... "

టౌన్‌హాల్లో పాట – పల్లవి "రిపీట్" అవుతూ "అహ ... ఓహో ... !" అంటోంది.

కొందరు ఉత్సాహవంతులు ఈలలు శృతి చేశారు. నవ్వులు - కేరింతలు !

భుజాల మీద చేతులు పక్కకు జారి చప్పట్లు చరుస్తున్నై.

రసస్ఫూర్తి కలిగిస్తూ – ఒక అరగంట గడిచింది.

టౌన్ హాల్ మైక్ గొంతు సవరించుకోసాగింది. "హలో ... హలో మైక్ టెస్టింగ్, ఒన్, టూ - త్రీ" ... ఇత్యాది భజన – పది నిముషాలు.

కార్లు నిమ్మళంగా ఆవరణలో కొచ్చి, స్పీడు పెంచుకుని లోపలి మెట్లదాకా పరుగెత్తి, అక్కడ పక్కకు తిరిగి, ఒకదాని వెంట ఒకటి సర్రున ఆగినై.

'ఛీఫ్‌గెస్ట్'లు దిగేరు.

పూలదండలు, ఫ్లాష్ క్లిక్కులు — పరంపరంగా మెరిసి వెలిగాయి.

స్టేజీ సర్దుకుంది. మైక్‌లో ఆహ్వానం అయింది.

దండలూ, క్లిక్కులూ మరోసారి, పునఃపునఃగా — తమలో తాము కబుర్లాడుకున్నై.

దాబా యింట్లో మైక్ " వందనం ... అభివందనం " అనసాగింది.

ఇంతలో ఒకరు హడావిడిగా టౌన్‌హాల్లో నుంచి బయటి కొచ్చి ఇంకొకరి చెవిలో ఏదో చెప్పి వెళ్ళిపోయారు.

ఆ ఇంకొకరు కాళ్ళల్లో కరెంట్‌ని ప్రవహింపజేసుకుంటూ దాబా యింట్లోకి పరిగెత్తుకొచ్చాడు. యజమాని ఎవరని ఆచూకీ తీశాడు. 'ఒకరు' తనకు అందించిన సమాచారాన్ని చాలా సీరియస్‌గా చెప్పేడు — సదరు యజమానికి.

క్షణం తర్వాత ఇంట్లో మైక్ మూత పడింది.

టౌన్‌హాల్లో మైక్ తన ఆడంబరాన్ని మరింతగా విజృంభించుకుంది.

వేదఘోష ప్రారంభమైంది. కుల వ్యవస్థకి గోరీ కట్టాలని చాటిచెప్పిన స్వర్ణోత్సవ పాత్రని ధరించిన నటుడికి సన్మానం మొదలైంది !!

అదే సినిమాలో " మీ ఆడంబరాలన్నీ కూకటి వ్రేళ్ళతో కూలద్రోయబడే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదు. " వంటి డైలాగులు చెప్పి జనంచేత చప్పట్లు కొట్టించుకున్న మరో తార—

'అచలశ్రీ' - ఆ నటుడికి కనకాభిషేకం చేయసాగింది. నల్భై వొక్కసారి ఫ్లాషులు వెలిగినై - ఆ సీనులో.

స్టేజీమీద చాలామంది ఆనంద భాష్పాలు చెమర్చారు.

కళగురించీ, సాహిత్యం గురించీ, కళాపోషణ గురించీ ఉపన్యాస పరంపర సాగిపోయింది.

సాహిత్య సంస్థ తాలూకు కార్యదర్శి నివేదిక చదువుతున్నాడు. శ్రోతల్లో కలకలం, ఈలలూ, పిల్లికూతలూ, అచలశ్రీగారు మాట్లాడాలని అరుపులు !

'అచలశ్రీ' నిలబడ్డారు. 'నాకు జనాన్ని చూస్తే కళ్ళు తిరుగుతై' అంది ఆమె.

"వాంతులొతాయా ?" అని ఎవరో అరిచారు.

ఆమెకు కోపం వచ్చింది. పళ్ళు కొరుక్కొని, పెదవులు బిగబట్టి, చేతులు వూపి, కాళ్ళ స్లిప్పర్సుతో నేలని తన్ని - ఠక్కున కూర్చుంది.

జనం ఆనంద సముద్రంలో ఈదులాడుతున్నారు.

వి. ఐ. పి. కవిగారి ప్రసంగం మొదలైంది. వారు 'ఓం' తో ప్రారంభించి, గురజాడ, వేమనల మీదుగా నడిచి, శ్రీశ్రీతో కరచాలనం చేస్తున్నట్టుగా సాగించి, స్టేజీమీద వున్న మాటల రచయితనీ, పాటల రచయితనీ పలకరించి - ఒకడు సూర్యుడు మరొకడు చంద్రుడూ అంటూ సెలవు తీసుకున్నాడు.

కలక్షన్ కోసం వేసిన ప్రత్యేక సంచికను మరో ప్రత్యేక అతిథి విడుదల చేశారు.

వారి ప్రసంగం మొదలైంది. జనంకూడా తమ స్వరాల్ని కొంచెం తగ్గించారు.

డాబా ఇంట్లో మైక్ కొంచెం 'పొజిషన్' మార్చుకుని రికార్డులని విడుదల చేయసాగింది.

టౌన్‌హాలుకు కుడి వైపు ప్రహరీగోడ వుంది. దాని మీద నుంచీ ప్రక్కగా పారుతున్న మురుగుకాల్వ గట్టుమీదికి ఓ గుడిసె వుంది.

ఇప్పుడు ఆ గుడిసెలో ఉన్నట్టుండి కలకలం బయల్దేరింది. ఆ గుడిసెకీ, ఆ యింట్లో వుండే ఆడదానికీ - యజమాని-మాంఛి మందుమీదున్నాడు. పెళ్ళాన్ని చావబాదేస్తున్నాడు.

అచలశ్రీ వయసుండి అవ్వలా తయారైన సదరు పెళ్ళాం 'వాడ్ని' నానా బూతులూ తిడుతూ, వాడి దెబ్బలు తనకు మరింతగా తగిలేటట్టు అందుబాటులోకి వెళ్తోంది. మధ్య మధ్యలో ఏడుస్తోంది. పెడబొబ్బలు పెడ్తోంది.

వాళ్ళ గారాల కూన - ఆరో ఏడున్న ఆరో సంతానం ఏడుపు ముఖంతో - తల్లి కొంగు పట్టుకుని లాగుతూ 'ఆకలవుతాందే' అని వెంటబడింది.

ఆ పిల్ల కళ్ళల్లో నీళ్ళు పేరుకునిపోయినై.

" ఛీ ... దరిద్రపుముండా. ఆకలో ఆకలో అంటూ ఏడిస్తే నే నెక్కడ తెచ్చేది. ఎట్టా సచ్చేది. నీళ్లు తాగి ఆ మూల చావు " అని నాలుగిచ్చుకుంది.

పిల్లది, ఆరున్నొక్కరాగం ఆరంభించింది.

డాబా ఇంట్లో వడ్డన మొదలౌతుంటే ' మైక్ ' "శంకరా భరణమూ " ఎత్తుకుంది.

టౌన్‌హాల్లో సంబరం లలిత సంగీత కచ్చేరీలోకి ప్రవేశించిందిప్పుడు. " శివరంజనీ ... " మొదలైంది.

పిల్లది ఆలాపిస్తున్న ' కుండలో నీళ్ళు కూడా లెవ్వే ' అన్న ' ముఖారి ' వీటన్నిటి మధ్యా పెగిలిరాలేదు !!

' ఈ పుస్తకం చదివి ఇవ్వు. బాగుంటుంది ' అని తన చేతిలో పుస్తకాన్ని నాకిచ్చి వెళ్ళిపోయాడు నా మిత్రుడు.

అది వొక హిందీ నవల.

పేరు చూశాను - " ఔర్ ఇన్సాన్ మర్ గయా " !

$0_00$